# అసలు సంగతి

**బాస్** అప్పచెప్పిన పని పూర్తిచేసి, ఆఫీసు నుండి బయటపడేసరికి రాత్రి ఎనిమిదయింది. షెడ్‌లో పార్క్ చేసిన స్కూటర్ తీసి ఇంటికి బయలుదేరాను.

మా ఇంటి గేట్ ముందు స్కూటర్ ఆగిన శబ్దం విని, నేనొచ్చేనని గ్రహించి, నా భార్య చిరునవ్వుతో ఎదురొచ్చింది. ఇంట్లోకి వెళ్లి, నేను సోఫాలో కూర్చోగానే, తను వంటింట్లోకి వెళ్లి, రెండు కప్పుల్లో వేడి కాఫీ తెచ్చి, ఒక కప్పు నా చేతికిచ్చి, తనొక కప్పు తీసుకొని, నా పక్కనే సెటిలయింది.

తన ప్రవర్తన కొద్దిగా ఆశ్చర్యం కలిగించింది. ఆఫీసు పని ముగించుకొని, నీరసంగా ఇంటికి చేరే నాకు, రోజూ శ్రీమతి కనబడేది ఏదో దానికి చికాకు పడుతూనే. ఏదో సణుగుతూనే కాఫీ కప్పు నా ముందు పడేస్తుండే గానీ, ఇలా చిరునవ్వుతో తెచ్చివ్వడం ఎరగను నేను. విషయం ఏమిటో బోధపడక శ్రీమతి నగుమోమునే చూస్తుండిపోయాను నేను.

ఆమె కూడా ఆ విషయం ఈ విషయం చెబుతుందే తప్ప, అసలు సంగతి బయటపెట్టలేదు.

గడియారం తొమ్మిది కొట్టేసరికి, నా భార్య గాభరాగా లేచింది. "అయ్యో! అప్పుడే తొమ్మిదయిపోయింది. అత్తగారు అన్నం తినందే మందులు వేసుకోరాయె. ఆవిడ భోజనానికి లేటయిపోయింది" అంటూ భోజనానికి అమ్మని పిలవడానికి వెళ్లింది.

నా ఆశ్చర్యం ఇంకా పెరిగిపోయింది. శ్రీమతికి ఇవాళ నా మీదే కాదు, మా అమ్మ మీద కూడా అభిమానం పుట్టుకొచ్చింది.

ఇంట్లో ఉండేది నలుగురమే. నేను, నా భార్య, మా అమ్మా, నాన్నా. అందులో నా శ్రీమతి, మా అమ్మా సఖ్యతగా మాట్లాడుకోవడం నేనెప్పుడూ చూడలేదు. ఇద్దరూ ఉత్తర ధృవం, దక్షిణ ధృవాల్లాగే ఉంటారు.


మా అమ్మా నాన్న అనారోగ్యంతో ఏమీ లేరు. అయినా వారంటే శ్రీమతి చికాకు పడని నిముషం లేదు. అటు అమ్మ కూడా అంతే. కోడల్ని ప్రేమగా చూసుకుంటే ఎంత బాగుండును. కోడలికి ఇంటి పనుల్లో సహాయపడడం నామోషీగా భావిస్తుంది. కోడలి చేత చేయించుకోవడం తన హక్కనుకుంటుంది.

నాకు అవతల అమ్మ ప్రవర్తన, ఇవతల శ్రీమతి ప్రవర్తన బాధిస్తూనే ఉంటాయి.

అమ్మని, నాన్నని భోజనానికి పిలవడానికి వెళ్లిన శ్రీమతి, వెంటనే తిరిగి వచ్చి, నన్ను కూడా భోజనానికి లెమ్మంది. "మీరు కూడా వస్తే, హాయిగా నలుగురం మాట్లాడుకుంటూ తినవచ్చు రండి" అంటూ, నలుగురికీ ఒకేసారి వడ్డించేసింది.

నాకు జరుగుతున్నది నిజమో, కలో అర్థం కాలేదు. ఇంట్లో ఉన్న నలుగురమూ హాయిగా మాట్లాడుకుంటూ ఎప్పుడూ భోజనం చేయలేదు. అలాంటిది, ఈ రోజు శ్రీమతి ప్రవర్తనలోని అనూహ్యమైన మార్పు ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కూడా కలిగించింది.

అయితే, భోజనాల మధ్య అసలు సంగతి శ్రీమతి చెప్పింది. మా అత్తగారు, మామగారు పండుగకి మా ఇంటికి రాబోతున్నారని ఫోన్ చేసినట్లు, వాళ్లిక్కడే



మూడు నాలుగు నెలలు ఉంటారని చెప్పింది. వాళ్లున్నన్నాళ్లు నేను వాళ్లని అల్లుడిలా కాక, కొడుకులా చూసుకోవాలి కనుక, శ్రీమతికి నాపై ప్రేమ పెరిగింది.

మా మామగారు, అత్తగారు విజయనగరంలో వాళ్లబ్బాయి దగ్గరే ఉంటున్నారు. వాళ్లకీ ఒక కొడుకు, కూతురు. వాళ్లమ్మాయితో నా పెళ్లి జరిగిన తరువాత, వాళ్లబ్బాయికి ఉద్యోగం రావడం, మా చెల్లినే అతనికిచ్చి పెళ్లి చేయడం జరిగిపోయాయి.

మా మామగారు, అత్తగారు మా ఇంటికొచ్చిన దగ్గర నుండి, శ్రీమతి ప్రవర్తన బాగా మారిపోయింది. పూర్వపు చికాకు, సణుగుడు మచ్చుకైనా కనబడడం లేదు సరికదా, నేను ఎప్పుడైనా మామగారికి నచ్చే స్వీట్లు, పళ్లు అతనికి కొనిస్తే, నా మీద ప్రేమ ఇంకా పెరిగిపోసాగింది.

పది రోజులు ఇలా హాయిగా గడిచేసరికి, ఒక రోజు మా బావమరిది నుండి ఫోన్ వచ్చింది. పండుగకు మా అమ్మానాన్నలను ఆహ్వానిస్తూ. మా అమ్మా నాన్నా కూడా ఉత్సాహంగానే బయలుదేరారు. కూతురు కాపురాన్ని దగ్గరుండి చూసుకోవచ్చని వాళ్లకీ సరదావే.

అక్కడకు చేరిన వెంటనే క్షేమంగా చేరినట్లు నాన్న ఫోన్ చేశారు. అల్లుడు అమ్మాయిని చాలా బాగా చూసుకుంటున్నాడని సంబరపడుతూ చెప్పారు.

పండుగ నాడు సాయంత్రం అవుతూనే, శ్రీమతి నన్ను సినిమాకు బయలుదేరదీసింది. అదేంటి? రాత్రికి వంటవరు చేస్తారు? అని ఆశ్చర్యంగా అడిగాను. "మా అమ్మ చేస్తుంది లెండి" అంది. ఆవిడ మీద పూర్తిగా వంట పని పెడితే ఆవిడ బాధపడతారేమో" అన్నాను. కానీ, వాళ్ల కూతుర్ని అల్లుడు సినిమాకు తీసుకెళితే వాళ్లకు సంతోషం అనీ, దాని ముందు వంట పని ఏం కష్టం కాదనీ, శ్రీమతి నాకు బోధపరిచింది.

"అదే మా అమ్మ అయితే మనం సినిమాకు వెళితే తను వంట చేయడానికి ఒప్పుకునేదా?" అంటూ నేనంటుండగానే నా జేబులోని సెల్‌ఫోన్ రింగయింది. 'ఎక్కడినించా?' అని చూశాను. బావమరిది ఫోన్ చేశాడు.

చెల్లీ, తనూ కలిసి సినిమాకే వెళ్లారట. సినిమా హాల్ దగ్గర నుండి ఫోన్ చేశాడు. "పండుగ నాడు హాయిగా సినిమాకి వెళ్లమని, తాను వంట పని చూసుకుంటానని, మా అమ్మే వాళ్లని సినిమాకి పంపించిందట."

"ఈసారి పండుగ అసలైన పండుగలా జరిగింది" అంటున్న నాతో మా బావమరిది అసలు సంగతి బయటపెట్టాడు. "మా అక్క అక్కడ మీ అమ్మానాన్నలకు చేయడానికి ఎలా చికాకు పడుతుందో, ఇక్కడ మీ చెల్లి కూడా మా అమ్మానాన్నలకి చేయడానికి అలానే అవుతుంది. తన అత్తరికాన్ని నిలబెట్టుకోవడానికి, మీ అమ్మా ఎలా ప్రవర్తిస్తోందో, ఇక్కడ మా అమ్మా అలాగే ప్రవర్తిస్తోంది. అందుకే నేను ప్లాన్ వేసి, మా పేరెంట్స్‌ని అక్కడకు పంపించి, మీ పేరెంట్స్‌ని ఇక్కడు పిలిచాను. మొత్తం మీద అందరం హాయిగా పండుగ చేసుకున్నాం" అన్నాడు.

"మనందరం హేపీగా ఇంకొంత కాలం ఉండాలంటే, ఇలాగే కొనసాగిద్దాం" అంటూ ఇంత మంచి ఆలోచన చేసినందుకు, బావమరిదిని మనసారా అభినందించాను.

-బి.హెచ్.వి.నాగేశ్వరరావు (రాయగడ)